



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

అభివృద్ధి పనులు వేగవంతం

- డిసెంబర్ 31లోపు చేయాల్సిన వన్నీ పూర్తి కావాలి
- గడువులోపు మ్యూటేషన్స్ పరిష్కరించాలి
- అనధికార లే అవుట్లు వేయకుండా చర్యలు - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- పత్తికొండ

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, డిసెంబర్ 31లోపు చేయాల్సిన అభివృద్ధి పనులన్నీ కచ్చితంగా పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు. శుక్రవారం పత్తికొండ గోపాల్ ప్లాజాలో పత్తికొండ డివిజన్ రెవెన్యూ ఆఫీసర్స్, ఇతర శాఖలకు సంబంధించిన డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. రెవెన్యూ, పిజిఆర్ఆర్ఎస్, వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇంజనీరింగ్, వైద్య, ఆరోగ్యం, విద్య తదితర శాఖలకు సంబంధించిన అన్ని అంశాలపై కలెక్టర్ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో లోతుగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కేసులకు సంబంధించి అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరించకుండా సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కేసులకు సంబంధించి ఏ కేసు ఏ స్టేటస్‌లో ఉందనే పూర్తి సమాచారంతో రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. కేసులకు సంబంధించిన నిబంధనలను జిపిలకు పంపాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు.. కోర్టు కేసులు, లోకాయుక్త ,ఎస్‌సి, ఎస్‌టి కమిషన్లకు సంబంధించిన కేసులు పెండింగ్ ఉండకూడదని, వారం లోపు నివేదికలు రావాలని కలెక్టర్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ రోజుకి 3 నుండి 4 సార్లు లాగిన్ అయి చెక్ చేసుకుంటూ ఉండాలన్నారు ...వచ్చిన దరఖాస్తులను గడువు లోపు పరిష్కరించాలన్నారు. ఎండార్స్‌మెంట్ ఎలా అంటే అలా ఇవ్వకూడదని, ఈ అంశాన్ని కలెక్టరేట్‌తో పాటు, సిఎంఒలో కూడా టీములు పరిశీలిస్తున్నాయన్నారు.ఎండార్స్‌మెంట్ సరైన రీతిలో లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. రీ సర్వేకు సంబంధించి గ్రామ సభల ద్వారా పత్తికొండ డివిజన్‌లో 5,389 వరకు పిటిషన్లు వచ్చాయన్నారు. వచ్చిన దరఖాస్తులలో దేవనకొండ, తుగ్గలి, ఆలూరు, ఆస్పరి మండలాల్లో ఎక్కువగా ఉన్నాయని, వీటిని ఎస్ఒపి ప్రకారం డిసెంబర్ 31 లోపు పరిష్కరించాలన్నారు. సివిల్ సప్లయిస్‌కు సంబంధించి పత్తికొండ డివిజన్‌లో 85 శాతం మాత్రమే రేషన్ సరుకుల పంపిణీ ఉందని, ఎందుకు తక్కువగా ఉందో కారణాలను వెరిఫై చేయాలని కలెక్టర్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. ఎఫ్‌పిషాప్‌ల రేషనలైజేషన్‌ను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఖరీఫ్ సీజన్ లో ఇకెవైసి 96 శాతం మాత్రమే చేశారని, మిగిలిన రైతులు ఇకెవైసి ఎందుకు చేసుకోవడం లేదు వెరిఫై చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఇకెవైసి పిఎం కిసాన్ రాదనే విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలియజేయాలని సూచించారు. పత్తికొండ డివిజన్‌లో పండ్ల తోటలను పెంచాలంటే రైతులకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆరా తీసి ..తెలుసుకున్నారు. రాయలసీమ లో అనంతపురం జిల్లాలో బత్తాయిని పండించి నాగపూర్, ఢిల్లీలకు ఎక్స్ పోర్ట్ చేస్తూ ఎక్కువ దిగుబడులు వస్తున్నాయని, అదే తరహాలో పత్తికొండ డివిజన్‌లో కూడా వచ్చే సంవత్సరం నాటికి బత్తాయి పండ్ల తోటల విస్తీర్ణం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పశుసంవర్థ శాఖకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాల మేరకు దేవనకొండ, పత్తికొండ, ఆస్పరి, ఆలూరు, చిప్పగిరి మండలాల్లో మినీ గోకులం పనులు గ్రౌండింగ్ కాలేదని, త్వరితగతిన గ్రౌండింగ్ చేసి పనులను జనవరి 15 వ తేది నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. ఉపాధి హామీ, మెటీరియల్ కంపోనెంట్‌కు సంబంధించి శాంక్షన్ చేసిన పనులను వెరిఫై చేసేందుకు ఎంపిడిఒలు వారం రోజులలో 4 రోజులు ఫీల్డ్ లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.. గడ్డి పెంపకం పై కూడా సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. ఆర్ అండ్ బి కి సంబంధించి పత్తికొండ టౌన్ పరిధిలో ఉన్నటువంటి గుత్తి - పత్తికొండ - ఆదోని రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి నిధుల మంజూరుకు సంబంధిత అధికారులకు డిఒ లెటర్ పంపాలని కలెక్టర్ ఆర్అండ్‌బి ఎస్‌ఇని ఆదేశించారు. పంచాయతీ రాజ్, హౌసింగ్ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సాగు నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితాలో తప్పులు జరిగితే సంబంధిత తహశీల్దార్ల పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పదవ తరగతి విద్యార్థులకు డిసెంబర్ 1 నుంచి వర్చువల్ పద్ధతిలో పాఠాల బోధన ప్రారంభం కావాలన్నారు. వైద్యం,ఆరోగ్యం, జిల్లా పరిషత్ తదితర శాఖలపై కూడా కలెక్టర్ సమీక్షించారు.

నీటి సంఘాల ఎన్నికలకు డిసెంబరు 5న నోటిఫికేషన్ : జెసి

నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 51న నోటిఫికేషన్ విడుదల చేస్తామని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య తెలిపారు. 8వ తేదిన ప్రాదేశిక నియోజకవర్గం ,వాటర్ యూజర్స్ అసోసియేషన్ కు ఎన్నికలు ఉంటాయని, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 11న, ప్రాజెక్ట్స్ కమిటీలకు 14న ఎన్నికలు ఉంటాయని జెసి తెలిపారు. ప్రతి ప్రాదేశిక నియోజకవర్గం పోలింగ్ ఆఫీసర్, పోలింగ్ అసిస్టెంట్‌ను నామినేట్ చేస్తామన్నారు. వాటర్ యూజర్స్ అసోసియేషన్ కు సంబంధించి ఒక ఎలక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌ను మండల స్థాయిలో అపాయింట్ చేస్తామన్నారు. వాటర్ యూజర్స్ అసోసియేషన్ కు సంబంధించి మండల స్థాయిలో తహశీల్దార్లు, ఎంపిడిఓలను నియమిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన భవనాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో గుర్తించాలన్నారు. 2022వ సంవత్సరం వరకు ఎవరైతే నీటి పన్ను చెల్లించారో వారు అర్హులు అని జాయింట్ కలెక్టర్ వివరించారు.అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వసూల్ రాజాలు

- ఆదోని సబ్ డివిజన్ పరిధిలో రెచ్చిపోతున్న పోలీసులు
- పంచాయితీలు, కేసుల విషయంలో అందిన కాడికి దోపిడీ



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

- ఆదోని సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్లో ప్రేమ వివాహం చేయడానికి ఓ ప్రేమ జంట నుంచి ఓ ఎస్ఐ ఏకంగా రూ.30 వేలు డిమాండ్ చేసినట్టు సమాచారం. అదే ఎస్ఐ పోలీస్ స్టేషన్ తనిఖీ ఉందని, ఈ తనిఖీలకు జిల్లా ఎస్పీ, డీఎస్పీ వస్తారని పోలీసు స్టేషన్ మరమ్మతులకు, పెయింటింగుకు ఖర్చు అవుతుందని చెప్పి ప్రతి పంచాయతీ సర్పంచి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ వసూలు చేసినట్టు సమాచారం. గ్రామాల్లో కర్ణాటక టెట్రా ప్యాకెట్లు అమ్ముతున్న వారి నుంచి నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.
- ఆదోని సబ్ డివిజన్ పరిధిలోని మరో స్టేషన్ ఎస్ఐ గ్రామాల్లో బెల్టుషాపు, మట్కా నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుంటున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గరుసు తవ్వకాలకు పాల్పడుతున్న వారి నుంచి నెలనెలా మామూళ్లు ఆ స్టేషనుకు చేరుతున్నట్లు తెలిసింది. ఆ ఎస్ఐకి ఒక కానిస్టేబుల్ అన్ని రకాలుగా సహకారం అందిస్తూ ప్రతి గ్రామం నుంచి వసూలు చేసి ఎస్ఐ చేతికి ఇస్తున్నట్టు సమాచారం. గతంలో ఆ కానిస్టేబుల్ ఒకసారి సస్పెండ్ అయినట్టు కూడా తెలిసింది.
- ఆదోని సబ్ డివిజన్ పరిధిలో మరో పోలీసు స్టేషన్ ఎస్ఐ ముందడుగు వేసి అక్రమ రేషన్ దందాకు పాల్పడుతున్న వారు నెలకు రూ.10వేలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

'ఫ్రెండ్లీ పోలీసింగ్' అంటూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు కొందరు ఖాకీలు తూట్లు పొడుస్తున్నారు. అందినకాడికి దోచుకోవడమే ధ్యేయంగా కొంతమంది ఎస్ఐలు వసూల్ రాజాల అవతారం ఎత్తారు. వీళ్ల వ్యవహారాలకు పైస్థాయి అండదండలు ఉండటంతో సలాం కొట్టేవాళ్లే తప్పితే వీరికి అడ్డు చెప్పేవారే లేకుండా పోయారు. ఆదోని సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది ఖాకీలు దారి తప్పుతున్నారు. అవకాశం దొరికిన చోటల్లా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ చేసిన హెచ్చరికలను పెడచెవిన పెట్టి మరీ వసూళ్లపర్వాన్ని కొనసాగిస్తున్నారు. పోలీస్‌శాఖ ప్రతిష్ఠను దిగజార్చేలా ఆదోని సబ్ డివిజన్లో కొంతమంది పోలీసులు పనిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏమాత్రం అవకాశం దొరికినా బాధితుల నుంచి డబ్బులు గుంజేస్తున్నారు. వీరిలో శాంతి భద్రతల విభాగంలో పనిచేసేవారే కాకుండా ట్రాఫిక్, ఇతర విభాగంలో పనిచేస్తున్నవారు కూడా ఉండడం ఆశ్యర్యానికి గురిచేస్తోంది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే సివిల్ కేసులు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించే క్రమంలో కొంతమంది ఎస్సైలు, సీఐలు సిబ్బంది ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. మరికొన్ని స్టేషన్లలో అధికారులు అవినీతికి దూరంగా ఉంటున్నప్పటికీ కిందిస్థాయి సిబ్బంది మాత్రం ఇరువర్గాల నుంచి దండుకుంటున్నారు. దాదాపు చాలా పోలీస్ స్టేషన్ల పరిధిలో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మామూలు ఇవ్వకపోతే....సార్ రమ్మంటున్నారు...

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో బార్లు, రెస్టారెంట్లు, అక్రమ రేషన్, అక్రమ మద్యం దుకాణాలు, లాడ్జీలు, బెల్ట్ షాప్ నిర్వాహకులను కొందరు కానిస్టేబుళ్లు టార్గెట్ చేస్తున్నారు. మొదట సున్నితంగానే బేరసారాలు సాగిస్తారు. దారికి వస్తే సరేసరి. లేదంటే సార్ రమ్మంటున్నారని తమదైన శైలిలో చెబుతారు. అక్రమ కేసులు పెట్టి బయటకు రాకుండా చేస్తామని బెదిరిస్తారు. దీంతో కేసులకు భయపడి చాలా మంది వేలకు వేలు సమర్పిస్తున్నారు. పోలీస్ స్టేషన్లపై నిఘా పెట్టాల్సిన ప్రత్యేక విభాగం అధికారులు, ఉన్నతాధికారులు ఆ వైపు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్కూల్‌టైమ్ మార్పుపై అసంతృప్తి

- మండలానికి ఓ హైస్కూల్లో అమలు
- ఉదయం 9 నుంచి 5 గంటల వరకు
- ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి
- యుటిఎఫ్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో పని వేళల సమయాన్ని ఒక గంట పెంచుతూ పాఠశాల విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా వ్యతిరేకత మొదలైంది. విద్యార్థుల మానసిక స్థితి కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే మండిపడుతున్నారు. ఇటీవల రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పాఠశాలల పనివేళలను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పాఠశాల పని వేళలు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అమలవుతుంది. ఇప్పుడు కొత్తగా పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలల పని చేయాల్సి ఉందని పేర్కొంది. అందుకుగాను మండలానికి ఒక హైస్కూలును ఎంపిక చేసి సవరించిన పనివేళల ప్రకారం పాఠశాల తరగతులను నిర్వహించాలని ఆదేశించింది. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు కూడా మండలంలోని ఒక హైస్కూల్ ఎంపిక చేసి ఈ విధానాన్ని అమలు చేసేందుకు పూనుకుంటున్నారు.

ఎనిమిది గంటలు బడిలోనే ఉండాల్సిందే

పాఠశాల విద్యాశాఖ సవరించిన పాఠశాల పని వేళల ప్రకారం విద్యార్థి , ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఎనిమిది గంటలు బడిలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఎక్కువ గంటలు విద్యార్థులు పాఠశాలల్లోనే గడపడం ద్వారా విద్యార్థులకు మానసిక స్థితి కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థులు ఏడు గంటలకు పైగా గడుపుతున్నారు. కొత్తగా సవరించిన పనివేళల ప్రకారం.. పీరియడ్‌కు ఐదు నిమిషాలు చొప్పున పెంచుతూ మరో గంట పెంచడం పట్ల విద్యార్థులు అవస్థలు పడే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఏడు గంటల మాత్రమే పాఠశాలలు పనిచేస్తుండగా ఎపిలో మాత్రం పెంచడం పట్ల సర్వత్రా వ్యతిరేకత మొదలైంది. విద్యార్థులు ఎక్కువసేపు పుస్తకాలకే పరిమితం కావడంతో జైలులో ఖైదీ లాగా బంధించడం పట్ల అనేక అనారోగ్య సమస్యలు బారిన పడే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పనివేళల మార్పు సరైంది కాదు: యుటిఎఫ్

పాఠశాలల పనివేళల మార్పు వల్ల గ్రామీణ ప్రాంతాలలో ఉండేటు వంటి పాఠశాలల విద్యార్థులు, బాలికలు అనేక సమస్యలు ఎదుర్కోవలసిన పరిస్థితి వస్తుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్,నవీన్ పాటి అన్నారు. వారు ప్రజాశక్తికి తెలిపిన వివరాల ప్రకారం... లేటుగా ఇళ్లకు వెళ్ళటం వలన ట్రాన్స్‌పోర్టు సమస్య వస్తుంది. దూరప్రాంతాలకు పోయే విద్యార్థిని విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతాయి. ప్రస్తుతం ఉన్న పనివేళలు లేదా సంఘాలతో మాట్లాడి సరైన సమయ వేళలు నిర్వహించాలి. ప్రస్తుతం ఉన్న పాఠశాలలు అనేక రకాలుగా ఉన్నాయన్నారు. కొన్ని హై స్కూల్స్ 6 నుంచి 10 వరకు ఉన్నాయి. మరికొన్ని 1 తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్నాయి. చిన్నపిల్లలయినా ఎలిమెంటరీ పాఠశాల వయసుగల పిల్లలకు ఈ ప్రస్తుతం ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన పనివేళలో వారికి ఒత్తిడిని , ఆ వయసుకు ఇబ్బందికరంగా ఉంటుంది. పాఠశాల పనివేళల పెంపుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి.



ఫిబ్రవరి 8న క్లస్టర్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

నంబర్ వన్ మోడల్ వర్సిటీగా తీర్చిదిద్దుతాం
ఉపాధి అవకాశాలు పొందేలా చర్యలు
క్లస్టర్ యూనివర్సిటీ విసి డివిఆర్ సాయి గోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలులోని క్లస్టర్ వర్సిటీని రాష్ట్రంలోనే నెంబర్ వన్ మోడల్ వర్సిటీగా తీర్చిదిద్దుతామని ఆ వర్సిటీ వైస్ ఛాన్సలర్ డివిఆర్.సాయి గోపాల్ వెల్లడించారు. ఫిబ్రవరి 8న వర్సిటీ మొదటి స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని బి.క్యాంపులో ఉన్న క్లస్టర్ వర్సిటీ లోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్‌ఛాన్సర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే ఏకైక క్లస్టర్ వర్సిటీ మనదేనని పేర్కొన్నారు. యూనివర్సిటీకి శంకుస్థాపన వేసింది కూడా ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని గుర్తు చేశారు. మూడు కళాశాలలో కలిపి ఒక వర్సిటీగా ఏర్పాటు చేశారన్నారు. ఈ కళాశాలలో అనేకమంది ఉన్నత విద్యాలయాల్లో రీసర్చ్ చేసిన అధ్యాపకులే ఉన్నారన్నారు. రూ 150 కోట్లకు పైగానే వర్సిటీ భవన నిర్మాణ పనులను చేపట్టామన్నారు. వచ్చే నెలలో వర్సిటీ పరిపాలన భవనాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధమైందన్నారు. దాదాపుగా వర్సిటీలో కొత్తగా 8 కోర్సులను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఈ కోర్సులు కూడా ఇక్కడ స్థానిక పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడే విధంగా ఉంటాయన్నారు. ఈ కోర్సులు చదివిన విద్యార్థులకు ఇక్కడే ఉపాధి అవకాశాలు పొందేలా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించిన ఫ్యాకల్టీ నియామకాల కూడా ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆమోదముద్ర వేశారన్నారు. క్లస్టర్ వర్సిటీని రాబోయే రోజుల్లో ఆల్ఇండియా ర్యాంకింగ్‌లో ఉన్నత స్థానంలో నిలిపేందుకుగాను పనిచేస్తున్నామన్నారు. ఇప్పుడు వర్సిటీ ద్వారానే విద్యార్థులకు పరీక్షల నిర్వహణ సిలబస్ పర్యవేక్షణ జరుగుతుందన్నారు. వర్సిటీ పరిధిలోని రెండు కళాశాలల హాస్టల్స్‌ను కూడా తమ ఆధీనంలోకి తీసుకున్నామని అన్నారు. క్లస్టర్ యువతరంగ్ పేరుతో మూడు కళాశాలల విద్యార్థులను ఏకం చేస్తూ క్రీడా సాంస్కృతిక పోటీలను నిర్వహించామని వెల్లడించారు. శనివారం జరిగే బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు సుమన్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ వర్సిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ కట్ట వెంకటేశ్వర్లు, ఒఎస్‌డిబాష, అధ్యాపకులు పార్వతి , తెలుగు అధ్యాపకులు వింధ్య వాసిని దేవి పాల్గొన్నారు.

అవసరానికి మించి యాంటీబయాటిక్ మందులు వాడొద్దు

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

అవసరానికి మించి యాంటీబయాటిక్ మందులు వాడరాదని కెఎంసి ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్ అన్నారు. శుక్రవారం (వావ్వ్) వరల్డ్ యాంటి మైక్రోబైల్ రెసిస్టెన్స్ ఆవేర్‌నెస్ వీక్ ఆధ్వర్యంలో యాంటీబయాటిక్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ హరి చరణ్ మాట్లాడుతూ అవసరానికి మించి యాంటీ బయాటిక్స్ వాడకం అనర్థదాయకమన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో "యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకొని మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ , ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు "బ్లూ కలర్ బెలూన్స్ మరియు డ్రసులు" ధరించి ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీని ఇన్చార్జి ప్రిన్సిపాల్ డా.హరిచరణ్ ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపరీతంగా అంటీ మైక్రోబియల్ మందుల వాడకం పెరగడం వలన రెసిస్టెన్స్ ఏర్పడి సదరు వ్యాధులకి ఆ మందులు పనిచేయకుండ పోతు న్నాయని తెలిపారు అందువల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి అని అన్నారు. మైక్రోబయాలజీ డిపార్ట్మెంట్ హెచ్.ఓ.డి ప్రొఫెసర్ డాక్టర్ రేణుక మాట్లాడుతూ మైక్రోబియర్ రెసిస్టెన్స్ పై చర్యలు తీసుకోక పోతే రాబోయే కాలంలో వ్యాధుల నివారణ కష్టం అని అందుకే ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించడం తదనుగుణంగా అనవసర యాంటీ బయాటిక్స్ వాడకం తగ్గించాలని పిలుపు నిచ్చారు.వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, ప్రొఫెసర్ నాగ జ్యోతి అసోసియేట్ ప్రొఫెసర్ విజయలక్ష్మి అసిస్టెంట్ ప్రొఫెసర్ శరణ్య, డా . ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

నియంత విధానాలకు 26న నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-సి బెళగల్

కేంద్ర ప్రభుత్వ నియంత విధానాలపై ఈ నెల 26న పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, డివిజన్ కార్యదర్శి జె.మోహన్ తెలిపారు. సి బెళగల్ ఎన్‌టిఆర్ పార్కులో కార్మిక సంఘాలతో కలిసి కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మికులను ఇబ్బంది కలిగిచే చట్టాను చేస్తుందని విమర్శించారు. 40 కార్మిక చట్లాను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చిందని, ప్రయివేటు కంపెనీల యజమానులకు కార్మికులను బానిసలు చేసేలా చట్టాలను సవరించిందన్నారు. అంగన్వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్, వెలుగు, సమగ్ర శిక్షా, ఉపాధి ఉద్యోగులకు సమాన వేతనం, పెంచన్, గ్రాడ్యుటీ, పదవీవిరమణ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని, అసంగటిత కార్మికులకు సామాజిక సంక్షేమం వంటి కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ఆహార భద్రత, నిత్యవసర ధరల నియంత్రణ, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, లేదంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వాటన్నింటి పరిష్కారానికి ఈ నెల 26న నిర్వహించే ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలనీ కార్మికులను కోరారు. ఈ కార్యక్రమలో అనంతమ్మ, మిరియమ్మ, మేరమ్మ, ఉషా, రంగమ్మ, రాజమ్మ, జమాల్‌బీ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


సి బెళగల్ ఎన్‌టిఆర్ పార్కులో కరత్రాన్ని విడుదల చేస్తున్న ఎండి అంజిబాబు, మోహన్

మాకు దారేది?

నరసింహారెడ్డి నగర్ కాలనీవాసుల ఆవేదన
కాంపౌండ్ వాల్ పేరుతో దారిని మూసేందుకు విద్యుత్ శాఖ యత్నం
లబోదిబోమంటున్న పేదలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్


పొక్లెయినర్‌తో పని చేయిస్తున్న అధికారులు, అడ్డుకుంటున్న మహిళలు

కర్నూలు నరసింహారెడ్డి నగర్ కాలనీవాసులు రోడ్డు సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నరసింహా రెడ్డి నగర్ పరిధిలో ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు ప్రస్తుతం పేదలు నడిచే దారిని మూసేస్తూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు తమకు దారేది అంటూ లబోదిబోమంటున్నారు. నరసింహారెడ్డి నగర్ పరిధిలో కేసి కెనాల్‌ను ఆనుకొని గత 40ఏళ్లకుపైగా పేదలు నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. ఇక్కడ సుమారు 250 నుంచి 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారు తమ ఇళ్లకు రెవెన్యూ శాఖ నుంచి పట్టాలు పొందారు. మున్సిపల్ శాఖ తాగునీటిపన్ను, ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. కేసి కాలువలను ఆనుకొని పేదలు నిర్మించుకున్న బాత్రూములను, వివిధ నిర్మాణాలను కూలదోసి గతంలో కేసి కెనాల్ వెంబడి అప్రోచ్ రోడ్డును కూడా వేశారు. ఈ రోడ్డు నేరుగా రైల్వే స్టేషన్ రోడ్డు బ్రిడ్జిమీదుగా ఆవలి వైపున నిర్మించిన కేసీకెనాల్ అప్రోచ్ రోడ్డుతో అనుసంధానించాల్సి ఉంది. ఇక్కడ కేసీ కెనాల్ ను ఆనుకొని ఇదివరకే సబ్ స్టేషన్ నిర్మించి ఉండడంతో ఆ రోడ్డు నిర్మాణం అక్కడికి ఆగిపోయింది. ఈ రోడ్డుకు ఈ ఆటంకం లేకపోతే కాలనీవాసులో ఆ రోడ్డుగుండా ఎలాంటి అవంతరాలు లేకుండా సాఫీగా ప్రయాణించేవారు. ఈ నేపథ్యంలో స్థానిక కాలనీవాసులు రోడ్డు చివరి నుంచి విద్యుత్తు కార్యాలయ ప్రాంగణం, మున్సిపల్ కార్యాలయం వాహనాలను ఆపుకొనే స్థలం గుండా రైల్వే స్టేషన్‌రోడ్డుకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అది కూడా గతంలో స్థానిక ప్రజలు తమ సమస్యను అప్పటి మున్సిపల్ కమిషనర్ బాలాజీకి విన్నవించుకోవడంతో ఈ దారిలోనే 4 అడుగుల రోడ్డును వేసేందుకు ప్రణాళికలు మున్సిపల్ అధికారులు రూపొందించారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ దారిని మూసి వేస్తూ విద్యుత్ శాఖ అధికారులు ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో సమస్య మొదటికి వచ్చింది. దీంతో ప్రజలు రాకపోకల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందంటున్నారు.

పనులను ఆపాలన్న కార్పొరేటర్

దారిని మూసేసే ప్రయత్నంలో భాగంగా విద్యుత్ అధికారులు శుక్రవారం జెసిబితో పాత గోడలను భారీవృక్షాలను తొలగించే కార్యక్రమానికి పూనుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక 46వ వార్డు కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు స్థానిక పేదలతో కలిసి అక్కడికి చేరుకుని విద్యుత్ అధికారులను పనులను నిలిపివేయాలని ప్రహరీ గోడను నిర్మించడం ద్వారా పేద ప్రజలు తమ ఇళ్లకు రాకపోకలు సాగించ డానికి ఇబ్బంది పడాల్సి వస్తుందని వివరించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు సిటీ ప్లానర్ ప్రదీప్ అక్కడికి చేరుకొని గతంలో అక్కడ 40 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు చేపట్టామని చెప్పారు.. సమస్యను వివరించి చెప్పడంతో విద్యుత్ అధికారులు కూడా దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి ముందుకు సాగుతామన్నారు. స్థానిక ప్రజలు శుక్రవారం విద్యుత్ అధికారులను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. తమకు దారి వదిలి ప్రహరీ నిర్మించుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దీనిపై మున్సిపల్ ,విద్యుత్ శాఖల అధికారులు పంతాలకు పోకుండా ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజలని ఇబ్బంది పెట్టొద్దు -నగరూరు శ్రీనివాసులు, కార్పొరేటర్



గతంలో మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న బాలాజీ పేద ప్రజల సమస్యను గుర్తించి కాలనీవాసులకు 40 ఫీట్ల రోడ్డును కేసీ కెనాల్ అప్రోచ్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ రోడ్డుకు అనుసంధానిస్తూ పరిష్కార మార్గాన్ని సూచించారు. అదే దారిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజా శ్రేయస్సులో భాగంగా విద్యుత్ అధికారులు స్పందించి దారిని వదిలి ప్రహరీని నిర్మించుకోవాలి

దారిని మూయొద్దు-టి.రాముడు సిపిఎం, న్యూ సిటీ కార్యదర్శి



కాయకష్టం చేసి సంపాదించుకొని పేదలు నిర్మించుకున్న ఇళ్లను నాలుగేళ్ల క్రితం రోడ్డునిర్మాణం పేరుతో తొలగించారు. రోడ్డు కోసం బాధను దిగమింగుకున్నారు. ఆస్తి పోయినా రోడ్డు వచ్చిందని సంతోషించారు. ఇప్పుడు విద్యుత్తు శాఖ అధికారులు ప్రహరీ పేరుతో ఏకంగా దారి మూసేసే ప్రయత్నం చేస్తున్నారు. దాన్నిమానుకొని పేదల రాకపోకలకు దారిని వదిలాలి. సబ్ స్టేషన్ తొలగించి రోడ్డును రైల్వేరోడ్డులోని కేసీ కెనాల్ వంతెన వరకు అనుసంధానించాలి.

ఇంటికి సరుకులెలా తెచ్చుకోవాలి: పార్వతి, బాధితురాలు



ఇంటికి ఏవైనా పెద్ద మొత్తంలో సరుకులు తెచ్చుకోవాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. ఆటోలు ఇంటి వద్దకు వచ్చే అవకాశం లేకపోవడం వల్ల ప్రధాన రోడ్డుపై సరుకులు దించుకొని, విభజించుకొని కొద్ది కొద్దిగా మోసుకోవాల్సి వస్తోంది.

రోడ్డు లేకుంటే జీవన మెట్లా: -లక్ష్మీదేవి స్థానికురాలు



కూలి నాలి పనులు చేసుకుని పిల్లాపాపలతో జీవనం సాగిస్తున్నాం. ఏ పని చేయాలన్నా ఇంటి నుంచి బయటికి రావాలి. కనీస రోడ్డు సౌకర్యం లేకపోతే పిల్లలను బడికి పంపాలన్న కష్టమే. జీవనం ఎట్లా సాగించాలో తెలియడం లేదు.

ట్రాఫిక్ సమస్య నియంత్రణపై డిఎస్‌పి ఆరా

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణపై డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు ఆరా తీశారు. శుక్రవారం స్థానిక ఎంటిఆర్ వరుసలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్, నదీతీర ప్రాంతం, రాఘవేంద్ర సర్కిల్, సంత మార్కెట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వాహనాల ద్వారా భక్తులు మంత్రాలయం వస్తారు. వారికి పార్కింగ్ సదుపాయం, రాకపోకల గురించి సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్‌తో చర్చించారు. సెలవు రోజుల్లో భక్తుల రద్దీ పెరిగుతున్న నేపథ్యంలో ప్రధాన రహదారిలో ఏర్పడుతున్న ట్రాఫిక్‌పై తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రస్తావించారు. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డీఎస్పీ తెలిపారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో కేసుల గురించి తెలుసుకొని రికార్డులను తనిఖీ చేశారు.

'కేంద్రం'పై సమరశంఖం పూరిద్దాం

- ఆదోనిలో 26న ర్యాలీ - రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి రాముడు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరిద్దామని రైతుసంఘం, ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు నాయకులు పంపన గౌడ్, రాముడు, ప్రసాద్, తిమ్మగురుడు కోరారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. రైతుసంఘం నాయకులు కెసి.జబ్బార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన సాగుతోందని తెలిపారు. కార్మికులకు నెలకు ఇవ్వాల్సిన రూ.26 వేల కనీస వేతనం ఇవ్వడం లేదని చెప్పారు. ఈ నెల 26న ఆదోనిలో జరిగే ర్యాలీ, మహా ధర్నాకు ఆదోని డివిజన్‌లోని కార్మిక, కర్షక, రైతు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎఐటియుసి నాయకులు విజయేంద్ర, రంగస్వామి, నారాయణ, నరసింహ, నాగరాజు, షరీఫ్, నాగప్ప, సిఐటియు నాయకులు అబ్దుల్లా, తిమ్మప్ప, ఐఎఫ్‌టియు నాయకులు ఏసోబు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై అవగాహన

ప్రజాశక్తి - ఆస్పరి

జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు క్షేత్ర స్థాయి ప్రదర్శనలో భాగంగా ప్రధానోపాధ్యాయులు విజయకుమారి ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఆపరేటర్ మల్లి మాట్లాడుతూ... విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ ఎలా సరఫరా అవుతుందో, విద్యుత్‌ను ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై, విద్యుత్ సరఫరా అయ్యే పరికరాలతో పాటు వివిధ రకాల పరికరాల వంటి విషయాల గురించి వివరించారు. నాడు ఇంట్లో దీపాలు, కొవ్వొత్తులతో కాలం గడిపే వారని, నేడు విద్యుత్ దీపాలు లేకపోతే ఒక్క క్షణం కూడా ఉండలేమని తెలిపారు. విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విద్యతో పాటు వృత్తి విద్యలో కూడా రాణించాలని విద్యార్థులను కోరారు. వృత్తి విద్య ఉపాధ్యాయులు శివకుమార్, రాజు, ఉపాధ్యాయులు ఆనంద్, బాబు పాల్గొన్నారు.

అపార్ ఐడిపై సమీక్ష

ప్రజాశక్తి - కౌతాళం



మాట్లాడుతున్న అధికారులు

కలెక్టర్, విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అపార్ ఐడి నమోదుపై సమీక్ష నిర్వహించారు. శుక్రవారం ఎంఇఒలు ఆంజనేయులు, శోభా రాణి మాట్లాడారు. ప్రతి పాఠశాలలో అపార్ ఐడి నమోదును వేగవంతం చేయాలని కోరారు. ఉన్నతాధికారుల నిర్దేశించిన కాల పరిమితిలో పూర్తిచేయాలని తెలిపారు. ఎంపిడిఒ సుబ్బరాజు, తహశీల్దార్ మల్లికార్జున స్వామి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

'రాష్ట్రస్థాయి'కి హత్తిబెళగల్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని హత్తిబెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరుణ్ కుమార్, మౌలా హుసేన్ రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్న బాబు తెలిపారు. శుక్రవారం వారు విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడారు. కర్నూలులో 21న జరిగిన సెపక్ తక్రా అండర్-14 బాలుర విభాగంలో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపారని చెప్పారు. ఈనెల 26, 27న నంద్యాల జిల్లా నందికొట్కూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రణాళికబద్ధంగా పట్టణాభివృద్ధి

- రూ.2 కోట్లతో బిటి రోడ్లు
- రూ.3.5 కోట్లతో పార్కుల అభివృద్ధి
- రూ.3 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారం
- అభివృద్ధిలో ఎమ్మెల్యే బీవీ ఆలోచనలను ఆచరిస్తున్నాం
- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



'పట్టణాభివృద్ధికి ప్రణాళికబద్ధంగా ముందుకెళుతున్నాం. పట్టణంలో ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు కేటాయించాం. పట్టణంలో ప్రస్తుతం ఉన్న రెండు పార్కులను అభివృద్ధి పరుస్తూ, మరో నాలుగు పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం తర్వాత ఎస్సీ కాలనీ, ఎంబి చర్చి దగ్గర రోడ్డు పనులు పూర్తయ్యాయి.' అని ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు...

పట్టణాభివృద్ధికి ఎలాంటి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు..?

కమిషనర్ : పట్టణాభివృద్ధికి ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకెళ్తున్నాం.

పట్టణంలో రోడ్ల పరిస్థితిని ఎలా మెరుగుపరుస్తారు..?

కమిషనర్ : పట్టణంలో ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు కేటాయించాం. ఎమ్మిగనూరు జాతరలోపు అన్ని ప్రధాన రహదారుల బిటి రోడ్లు పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం.

రోడ్లు ఎక్కడెక్కడ వేస్తున్నారు..?

కమిషనర్ : రూ.96 లక్షలతో (గంజహళ్లి రోడ్డు) అంబేద్కర్ సర్కిల్ నుంచి బైపాస్ వరకు, అంబేద్కర్ సర్కిల్ నుంచి ఎంబి చర్చి వరకు రూ.1.07 కోట్లతో రోడ్లు వేస్తున్నాం.

పార్కుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

కమిషనర్ : పట్టణంలో ప్రస్తుతం ఉన్న రెండు పార్కులను అభివృద్ధి పరుస్తూ, మరో నాలుగు పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. శిల్పా ఎస్టేట్‌లో రెండు పార్కులు, ఎస్సీ కాలనీలో ఒక పార్కు, సంజీవ్ నగర్‌లో ఒక పార్కును ఏర్పాటు చేస్తున్నాం.

పార్కుల ఏర్పాటుకు ఎంత నిధులు కేటాయిస్తున్నారు..?

కమిషనర్ : పార్కుల ఏర్పాటుకు రూ.3.5 కోట్లతో అభివృద్ధి ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

సెంట్రల్ లైటింగ్ ఎక్కడ వరకు విస్తరింప చేస్తున్నారు..?

కమిషనర్ : రూ.60 లక్షల నిధులతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను తీసుకొచ్చాం. వైఎస్ఆర్ సర్కిల్ నుంచి శ్రీనివాస సర్కిల్ వరకు, శ్రీనివాస సర్కిల్ నుంచి శ్రీనీలకంఠేశ్వర దేవాలయం వరకు చేపట్టనున్నాం.

కొత్త ప్రభుత్వం వచ్చాక తర్వాత ఏర్పాటు చేసిన ప్రధాన రహదారి ఏది..?

కమిషనర్ : ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం తర్వాత ఎస్సీ కాలనీ, ఎంబి చర్చి దగ్గర రోడ్డు పనులు పూర్తయ్యాయి. అలాగే అనేక కాలనీల్లో అంతర్గత బిటి రోడ్లు కూడా ప్రారంభమయ్యాయి.

తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టారు..?

కమిషనర్ : పట్టణంలో 90 శాతం ప్రాంతాలకు తాగునీరు అందుతోంది. ఎమ్మెల్యే బీవీ ఆదేశాలతో సంజీవయ్య నగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో సమస్య పరిష్కారానికి రూ.3 కోట్లతో ప్రణాళిక రూపొందించాం.

వీధి కుక్కల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు..?

కమిషనర్ : పట్టణంలో ఇప్పటివరకు 1800 వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయించాం. మరో 580 కుక్కలకు చేయించాల్సి ఉంది.

వీధి పశువుల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు..?

కమిషనర్ : పట్టణంలో 90 శాతం వీధి పశువులను గోశాలకు తరలించాం. మిగతా వాటిని కూడా తరలిస్తాం.

పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ఎంతవరకు పూర్తయ్యాయి..?

కమిషనర్ : పట్టణంలోని 90 శాతం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పూర్తయ్యాయి. మరో రూ.13 కోట్ల నిధులు వెచ్చిస్తే పూర్తిస్థాయి పనులు పూర్తవుతాయి.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్లపైనే మురుగునీరు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరులోని ప్రధాన రహదారులు డ్రెయినేజీని తలపిస్తున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. రోడ్లపై నడవాలంటే దుర్గంధం భరించలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి, అంబేద్కర్ విగ్రహం ఎదుట, కురువ కాలనీలో రోడ్లు ఏవో.. డ్రెయినేజీ ఏదో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అధికారులకు, సర్పంచికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మురుగునీటితో దుర్గంధం వెదజల్లి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట దోమల బెడద తీవ్రంగా ఉంటుందని వాపోతున్నారు.

పారిశుధ్య పనుల్లో అధికారులు విఫలం

- సిపిఎం నాయకులు పరమేష్, ఈరన్న

అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనీసం పారిశుధ్య పనులు కూడా చేయించడం లేదు. డ్రెయినేజీ పూడిక తొలగించి, రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చూడాలి.

అపరిశుభ్రతను తొలగించాలి

- దేవదాసు, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలి. బస్టాండ్ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలి.

సేవలను వినియోగించుకోండి

- ఎపిజిబి మేనేజర్ రామచంద్రుడు

ప్రజాశక్తి - చిప్పగిరి



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రామచంద్రుడు కోరారు. శుక్రవారం నేమకల్లు ఎపిజిబి బ్యాంకులో ఆయన మాట్లాడారు. ఎపిజిబిలో సభ్యత్వం ఉన్న ప్రతి ఖాతాదారుడూ బ్యాంకులో ఏయే సేవలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ఎస్ఎంఎస్ ఛార్జీలు, ప్లాటినం డిబేట్ కార్డు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఎటిఎం నగదును ఒక రోజుకు రూ.50 వేలు తీసుకోవడానికి వెసలుబాటు ఉందన్నారు. లాకర్ అద్దెలో పెట్టే వస్తువులకు 25 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. కరెంట్ ఖాతాకు సంబంధించి నగదు నిర్వహణ చార్జీలు కూడా ఉచితంగా ఉంటాయన్నారు. మొబైల్, ఇంటర్‌నెట్, బ్యాంకింగ్ సౌకర్యం ఉందని తెలిపారు. డిపాజిట్లపై నామినేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. డిపాజిట్ రూ.10 వేల నుంచి గరిష్ఠ డిపాజిట్ రూ.కోటి లోపు చేసుకోవచ్చని చెప్పారు. ప్రగతి కుబేర్‌లో ఫిక్స్ డిపాజిట్ పథకంలో అన్ని బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ రేటు 8.30 శాతం పొందవచ్చని తెలిపారు.

సామాజిక సేవలో పోలీసు శాఖ

- ఉచిత వైద్య శిబిరంతో ప్రజలకు చేరువ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు సామాజిక సేవలోనూ భాగస్వామ్యం వహిస్తామని పోలీసు శాఖ నిరూపించింది. బాధ్యతల్లో భాగంగా సమయపాలన లేకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసు శాఖ అధికారులు ప్రజలతో స్నేహంగా మెలిగేందుకు కృషి చేస్తున్నారు. ప్రజలకు చేరువ అయ్యేందుకు శుక్రవారం పోలీసు స్టేషన్‌లో సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్‌తో పాటు పోలీసు శాఖ సిబ్బంది, పాత్రికేయులు, సామాన్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్, ఇసిజి వంటి పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇమ్రాన్ మాట్లాడారు. రోజూ వారి వారి వయస్సును అనుసరించి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. నిత్యం వ్యాయామం, యోగా లాంటివి చేయాలని, వాకింగ్‌తో కాళ్లకు పని చెప్పడం చేస్తూ ఒత్తిడి లేకుండా చూసుకోగలిగితే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అనారోగ్య సమస్యలున్న వారు తమ ఆస్పత్రిని సందర్శించాలని, అవకాశం ఉన్న వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ రిలేషన్ బాలమద్దిలేటి, క్యాంప్ ఇన్‌ఛార్జీ ప్రశాంత్, నర్సులు నందిని, మహేశ్వరి, హెడ్ కానిస్టేబుళ్లు రమణ, విజయ్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, కానిస్టేబుళ్లు రఘు, శ్రీనివాసులు, జమీర్, లక్ష్మన్న, నాయక్, హోంగార్డులు నాగేశ్వర్ రెడ్డి, వీరేష్ పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దేశ, విదేశాలకు జగన్ అవినీతి

- తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు



వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి అవినీతి దేశ, విదేశాలకు విస్తరించిందని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. జగన్ అవినీతి ఆంధ్రప్రదేశ్‌తో పాటు అమెరికాలోనూ పెనుప్రకంపనలు సృష్టించిందన్నారు. భారీ సౌరవిద్యుత్ ప్రాజెక్టు కట్టేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అదానీ సంస్థల ద్వారా రూ.1,750 కోట్లు లంచం తీసుకున్నట్లు అమెరికా దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఇన్వెస్టిగేషన్ వెల్లడించిందని తెలిపారు. ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని విదేశాలకు అమ్మిన ఘనత వైఎస్.జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని విమర్శించారు.

రికార్డుల్లేకుండా వాహనాలు నడిపితే జరిమానా

- ట్రాఫిక్ సిఐ సుబ్బారావు

ప్రజాశక్తి - ఆదోని

రికార్డుల్లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని ఆదోని ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. శుక్రవారం ఆదోని బైపాస్ రోడ్డు ఆస్పరి రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు లేని వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. ఎఎస్ఐ లక్ష్మయ్య ఉన్నారు.

బడ్జెట్‌లో వేదవతి నిర్మాణానికి రూ.500 కోట్లు కేటాయించాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ఆలూరు నియోజక వర్గం కరువు కాటకాలు, వలసల నుంచి ప్రజలను, రైతులను కాపాడుకోవడానికి ఏకైక మార్గం వేదవతి నిర్మాణమేనని, అందుకు 2024-25 బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్ రెడ్డి కోరారు. గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరు ప్రాంత ప్రజల జీవనాడి వేదవతి ప్రాజెక్టు నిర్మించాలని మూడు దశాబ్దాలుగా రైతులు, ప్రజలు పోరాడుతూ పాలకులు, ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. 2018లో జిల్లాలోని కోడుమూరులో వేదవతి ప్రాజెక్టును వర్చువల్‌గా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించి.. 2019 జనవరి 29న జిఒ ఆర్‌టి నెంబరు 77ద్వారా రూ.1.942 కోట్లతో వేదవతి ప్రాజెక్టు నిర్మించేందుకు అనుమతులు వచ్చాయని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక 'రివర్స్ టెండరింగ్' అంటూ నిధులను, 8 టిఎంసి నీరు నిలుపుదలను కుదించి రూ.1,600 కోట్లతో 3.5 టిఎంసిలకు మార్పు చేశారని తెలిపారు. మెగా కంపెనీ పనులు చేపట్టగా అర్ధాంతరంగా నిధులను వైసిపి ప్రభుత్వం మరల్చడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ సాగు నీరందిస్తామని చెప్పడంతో ఆలూరు ప్రాంత రైతులు, ప్రజలు ఎంతో ఆశలు పెంచుకున్నారని తెలిపారు. 2024-25 బడ్జెట్‌లో వేదవతి, నగరడోన రిజర్వాయర్లకు నిధులు కేటాయంచకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించి వేదవతి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి... ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిందని, పెండింగ్ ప్రాజెక్టుల్లో ఉన్న వేదవతి, నగరడోన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేదవతి రిజర్వాయర్ పూర్తి చేసే వరకు ప్రజలను, రైతులను, కలిసి వచ్చే పార్టీలను, ప్రజాసంఘాలను కలుపుకొని పోరాడతామని నాయకులు తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణయ్య, ప్రభాకర్ రెడ్డి

పిఎసి సభ్యులుగా ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



శాసనసభలో ప్రజా పద్దుల కమిటీ (పిఎసి) సభ్యులుగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఎంపికయ్యారు. బీవీ పిఎసి కమిటీ సభ్యులుగా ఎంపికైనట్లు శుక్రవారం ప్రభుత్వ పెద్దలు ప్రకటన విడుదల చేశారు.

హామీల అమలుకు శ్రీకారం

- జనసేన మండల నాయకులు పులిరాజు

ప్రజాశక్తి - ఆదోని



ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలుకు దశలవారీగా శ్రీకారం చుట్టిందని జనసేన మండల నాయకులు పులిరాజు తెలిపారు. శుక్రవారం ఆయన జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యంత్రి పవన్ కల్యాణ్ అమలు చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా కర్నూలు కూడా ప్రాధాన్యత కల్పిస్తుండడం శుభ పరిణామమని చెప్పారు. గతంలో వైసిపి ప్రభుత్వం రాయలసీమను కర్నూలు జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని అబద్ధపు ప్రచారం చేస్తూ అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలను, న్యాయవాదులను మోసం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు నిర్ణయాన్ని అన్ని వర్గాలూ హర్షిస్తున్నాయని తెలిపారు.

హైకోర్టు బెంచ్ హర్షనీయం

- టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు

ప్రజాశక్తి - పెద్దకడబూరు



కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షనీయమని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కర్నూలును న్యాయరాజధానిగా చేయటానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.


వివాదాలకు కేరాఫ్ ఆ అధికారి

- మూడు రోజులుగా ఉపాధి కార్యాలయంలోనే ఎంపిడిఒ విధులు..!
- డ్యూటీ సర్టిఫికెట్ చింపేసిన ఎంపిడిఒ
- ఉద్యోగాలు చేయలేమంటున్న సిబ్బంది

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆ ఎంపిడిఒ ఎక్కడ విధులు నిర్వహిస్తే.. అక్కడ వివాదాలు. గతంలో తుగ్గలి, ఆస్పరి, కోసిగిలో పని చేసినప్పుడు ఘర్షణలు, గొడవలు, కేసులు తప్ప సక్రమంగా పని చేసిన దాఖలాలు లేవు. ఈయన బదిలీ మీద ఆదోనికి వస్తున్నారని తెలుసుకొని కొందరు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మరోచోటికి బదిలీపై వెళ్లారు. ఆయన నోటి దురుసు వల్ల.. ముఖ్యంగా మహిళా పంచాయతీ కార్యదర్శులు బదిలీలు అయ్యారు.

ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ గత మూడు రోజులుగా ఉపాధి కార్యాలయంలో తిష్ట వేసి అక్కడే విధులు నిర్వహిస్తున్నారని ఉపాధి సిబ్బంది తెలిపారు. అక్కడ ఇన్‌ఛార్జీ ఎపిఒగా విధులు నేడుస్తున్న కాలిక్, ఉపాధి సిబ్బందిని వేధింపులు గురి చేస్తున్నట్లు తెలిసింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ టెక్నికల్ అసిస్టెంట్ తమ బంధు వర్గం కావడంతో ఈసీ ప్రమోషన్ ఇప్పించి, ఇన్‌ఛార్జీ ఎపిఒగా బాధ్యతలు ఇప్పించాలని తాపత్రయ పడుతున్నట్లు సమాచారం. అక్కడ విధులు నిర్వహిస్తున్న 19 మంది సిబ్బంది జీతాలు పెట్టేందుకు డ్యూటీ సర్టిఫికెట్‌ను ఎంపిడిఒకు అందిస్తే 18 మంది డ్యూటీ సర్టిఫికెట్ చింపేసి, బంధు వర్గమైన ఒక్క ఉద్యోగికి మాత్రమే సంతకాలు పెట్టి ఉద్యోగులపై కస్సుబుస్సులాడారు. చివరకు ఉద్యోగస్తులంతా కలిసి సాయంత్రం 5 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్‌ను కలిస్తే చివరకు డ్యూటీ సర్టిఫికెట్‌పై సంతకాలు పెట్టారు.



ఉపాధి కార్యాలయంలో ఎంపిడిఒ

ఫీల్డ్ అసిస్టెంట్‌లో మార్పులు, చేతివాటం

ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని వేరొకరిని చేర్చుకుంటామని స్వయంగా ఆయననే అభ్యంతరాలు తెలిపే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో 38 మంది ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నప్పటికీ సామాజిక తనిఖీల అనంతరం 20 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చేశారు. అర్హత, జాబ్ కార్డు లేకున్నా.. కూటమి నాయకుల సిఫార్సుతో ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.30 వేలు తీసుకున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అవినీతి చేసిన వారిపై చర్యలు తీసుకుంటే.. అభ్యంతరం లేదని, ఏ తప్పు చేయకుండా 18 ఏళ్లుగా పనిచేస్తున్న పాండవగల్లు ఫీల్డ్ అసిస్టెంట్‌ను వేధింపులు గురి చేశారని పాండవగల్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

డ్యూటీ సర్టిఫికెట్ చింపలేదు

- ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్

డ్యూటీ సర్టిఫికెట్ నేను చింపలేదు. ఉపాధి కార్యాలయంలో పనులు సరిగా చేయడం లేదని మందలించాను. సాయంత్రం ఉపాధి సిబ్బంది కార్యాలయానికి వస్తే సంతకం పెట్టి పంపించాను.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

- లింగన్న, సిపిఎం మండల కార్యదర్శి



వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్‌పై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. ఉపాధి కార్యాలయం జరుగుతున్న అవకతవకలను నియంత్రించాలి. గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి.

రాష్ట్రస్థాయి పోటీలకు గోనెగండ్ల విద్యార్థి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి అంకిత రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు రాజేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం కర్నూలులోని అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీల్లో అంకిత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 30న కర్నూలులో జరిగే అండర్-19 రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటున్నట్లు చెప్పారు. విద్యార్థినిని, ఆమెకు సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు షఫీ, నసీరుల్లా బేగ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. సీనియర్ ఉపాధ్యాయులు ఉస్మాన్, భాస్కర్, గుమ్మల బాబు, అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

'24న వాల్మీకి వన భోజనం'

ప్రజాశక్తి - దేవనకొండ

ఆలూరు పట్టణంలో ఈనెల 24న జరిగే వాల్మీకి కార్తీక వనభోజన కార్యక్రమానికి వాల్మీకులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున కోరారు. శుక్రవారం మండలంలోని బేతపల్లి, కరివేముల, దేవనకొండ, తెర్నేకల్లు తదితర గ్రామాల్లో వాల్మీకి కార్తీక వనభోజన కరపత్రాలను పంపిణీ చేశారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజా కార్యక్రమం, బైక్ ర్యాలీ, వాల్మీకుల ఐక్యత, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకులపై చర్యలు : సిఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ అనుమతి మేరకు మూడు మద్యం దుకాణాలు ఉన్నాయని తెలిపారు. ఈ షాపులకు అనుబంధంగా కానీ, మరే రకంగా కానీ గొలుసు మద్యం దుకాణాలు గ్రామాల్లో ఎవరూ నిర్వహించరాదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి బెల్టుషాపులు నిర్వహిస్తే సమాచారాన్ని ఎక్సైజ్ శాఖకు, స్థానిక పోలీసులకు ఇవ్వాలని కోరారు.

కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడని

తండ్రిని చితకబాదిన కుమారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

తమకు పెళ్లిళ్ల చేయడం లేదని, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడని కుమారులు కన్న తండ్రిని కాళ్లు విరిగేలా చితకబాదిన సంఘటన గోనెగండ్లలో చోటుచేసుకుంది. గోనెగండ్ల గ్రామానికి చెందిన నేసే మంత రాజుకు ఎమ్మిగనూరుకు చెందిన అతని అక్క కుమార్తె ఆదిలక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి కుటుంబం కిరాణ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడు నీలకంఠ, జగదీష్, కుమార్తెకు వివాహం కాలేదు. పిల్లల వివాహాల గురించి పట్టించుకోకపోవడం, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడంతో కొద్దిరోజులుగా తండ్రి మంతరాజుకు, భార్య, కుమారులకు మధ్య పెద్దల సమక్షంలో పంచాయితీలు జరుగుతున్నాయి. శుక్రవారం కుమారులే తండ్రిపై దాడి చేసి చితకబాదడంతో మంతరాజు కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గోనెగండ్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సిఐ గంగాధర్‌ను వివరణ కోరగా... గాయపడిన మంతరాజు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని, పూర్తి సమాచారం వచ్చిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గాయపడిన మంత రాజు

చలికాలంలో పిల్లల పట్ల అశ్రద్ధ వద్దు

- డాక్టర్ ఆదిత్య కుమార్

ప్రజాశక్తి - ఆదోని



చలి తీవ్రత రోజూ పెరుగుతోందని, చిన్నారులకు శ్వాస సంబంధిత జబ్బులు సోకే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదిత్య నర్సింగ్ హోమ్, చైల్డ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆదిత్య కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. చలి కాలంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, మంచు తీవ్రత హెచ్చుగా ఉంటుందని తెలిపారు. కాలువలో నీరు ఉండడం వల్ల దోమల వృద్ధి చెందుతాయని, దోమకాటు వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీటి తొట్టెలు, మురుగు కాలువలు, కొబ్బరి బోండాలు, పూల కుండీలు, ఎయిర్ కూలర్, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమతెర వాడుతూ, చిన్నారి శరీరం అంతా కప్పి ఉండేలా, వెచ్చని దుస్తులు ధరింపజేయాలని తెలిపారు. వేడి చేసిన నీటినే తాగించాలన్నారు. జలుబు, దగ్గు, పడిశం వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. కలుషిత నీటిని సేవించడం వల్ల డయేరియా, అతి సార ప్రాణాంతక వ్యాధులు పిల్లలకు సోకే అవకాశం ఉందన్నారు. అవగాహన లోపం వల్ల ఇప్పటికే చిన్నారుల ఆరోగ్యం పట్ల సొంత వైద్యం, అనుభవం లేని డాక్టర్‌ను సంప్రదించి వ్యాధి తీవ్రత పెంచుతున్నారని తెలిపారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల జ్వరం తీవ్రత తట్టుకోలేక అపస్మారక స్థితిలోకి జారుకునే అవకాశం ఉంటుందన్నారు. తమ ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తూ, అన్ని పరీక్షలకు ల్యాబ్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. టీకాలు, వ్యాక్సినేషన్ సదుపాయం ఉందన్నారు. క్రిటికల్ రోగాల బారిన పడిన వారికి ఇసియు, వెంటిలేటర్ సౌకర్యం ఉందన్నారు. అనుభవజ్ఞులైన గైనిక్ డాక్టర్ జానకి ఆధ్వర్యంలో సంతాన సాఫల్య సౌలభ్యం అందుబాటులో ఉందని తెలిపారు. సంతానం లేని దంపతులకు ఐయుఐ పద్ధతి ద్వారా సంతానం కలిగేలా చూస్తారన్నారు. రాంజల రోడ్డులోనే తమ ఆస్పత్రి ఉందని, తమ సేవలను చుట్టుపక్క ప్రాంతాలవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెక్స్ టైల్స్ పార్కు కోసం కృషి చేసిన

బీవీకి కృతజ్ఞతలు : టిఎన్‌ఎస్‌ఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బనవాసిలో 77 ఎకరాల్లో టెక్స్‌టైల్స్ పార్కు కోసం కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డికి నిరుద్యోగ యువత, టిఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు మాదిగ నాగరాజు, నందవరం మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, నాయకులు రంజిత్ కుమార్, బొగ్గు రమేష్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాదిగ నాగరాజు మాట్లాడారు. బనవాసిలో టెక్స్ టైల్స్ పార్కు ఏర్పాటుకు చేనేత, జౌళి శాఖతో 91 ఎకరాల ప్రభుత్వ భూమిని 2016లో టిడిపి ప్రభుత్వం డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి టెక్స్ టైల్స్ పార్కు ద్వారా ఎలాంటి ఉపయోగం లేదని.. వాటిని తుంగలో తొక్కి, నిరుద్యోగుల ఆశలపై నీళ్లుచల్లారని మండిపడ్డారు. మళ్లీ ఇప్పుడు బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక టెక్స్‌టైల్స్ పార్కు గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, మంత్రి సవితతో మంజూరు చేయించారని తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు